సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 26 । డిసెంబర్ । 2024



చోరీల్లో వేగం పెంచాడు
వ్యసనాలకు బానిసైన కారు డ్రైవర్ చోరీల్లో వేగం పెంచి పోలీసులకు చిక్కాడు. రూ.13.80 లక్షల చోరీ సొత్తుని పోలీసులు రికవరీ చేశారు. 8లో ▸



10 రోజులు.. 210 బస్సులు
సంక్రాంతి పండుగకు 'పశ్చిమ' ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. హైదరాబాద్‌కు జనవరిలో 10 రోజులపాటు 210 బస్సులు నడపనున్నారు. 8లో ▸



పశువధపై పోరుబాట
తేతలిలో పశువధ కర్మాగారంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గురువారం నుంచి ఫ్యాక్టరీ ఎదుట గో సేవా సమితి నిరసన చేపట్టనుంది. 8లో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ మూలవిరాట్ పునః దర్శనం



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి మూలవిరాట్ పునః దర్శనం 14 రోజుల తర్వాత భక్తులకు కల్పించారు. ఆలయ 61వ వార్షిక మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరణ పనుల నిమిత్తం ఈనెల 11 నుంచి 24 వరకు మూలవిరాట్ దర్శనం నిలిపేశారు. తిరిగి బుధవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో జంధ్యాల గంగాధర్‌శర్మ (తాళ్లపూడి) కళాన్యాసం పూజలు నిర్వహించి **అమ్మవారి** పునః దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే **అంజిబాబు** ఆలయంలో ప్రత్యేక పూజలు **చేయించారు.** అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



శంకుస్థాపన చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): భవ్య భీమవరం పేరిట భీమవరంలో మౌలిక వసతుల అభివృద్ధికి పనులు చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్, మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం భీమవరంలోని దాతల సహకారంతో మూడు పార్కుల అభివృద్ధి పనులు, పాత బస్టాండ్ నూతన కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పనులకు భవ్య భీమవరం పేరును ఖరారు చేశామన్నారు. కాస్మో పాలిటన్ క్లబ్ ప్రెసిడెంట్ అల్లూరి పద్మరాజు సహకారంతో వంశీకృష్ణనగర్‌లో పార్కు నిర్మాణానికి, ఏఎస్‌ఆర్‌సేవా సమితి, దాతల సహకారంతో ఏఎస్‌ఆర్ వాటర్ ట్యాంక్ పార్కులో మౌలిక వసతులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు ఆర్థిక సహకారంతో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆదిత్య కళావేదిక పార్క్‌లో మౌలిక వసతులు, రామ భద్రరాజు ట్రస్ట్ అధ్యక్షుడు చేకూరి రామభద్రరాజు సహకారంతో పాత బస్టాండ్ కాంప్లెక్స్ పునః నిర్మాణానికి భూమి పూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అల్లూరి పద్మరాజు, కాశీ విశ్వనాథరాజు, సీహెచ్ కృష్ణంరాజు చేకూరి రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

అడ్మినిస్ట్రేటివ్ అధికారుల బదిలీ
ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కోర్టులో పనిచేస్తున్న పలువురు పరిపాలనా అధికారులను బదిలీ చేశారు. ఏలూరు ఫ్యామిలీ కోర్టు కమ్ 7వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టు నందు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.అమరనాథ్‌ను విజయవాడ బదిలీ చేశారు. ఏలూరు ప్రధాన న్యాయమూర్తి కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్ ఎస్.గీతను కాకినాడకు బదిలీ చేశారు. రాజమండ్రిలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న పి.సీతారామరాజు ను భీమవరం పోక్సో కోర్టులో నియమించారు. కాకినాడ పీడీజే కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్ పి.స్వర్ణదేవిని తాడేపల్లిగూడెంలోని 5వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారు.

విహారయాత్రకు వెళుతూ మృత్యుఒడికి..



కారు సీటులో మృతిచెందిన గౌతమ్

ద్వారకాతిరుమల: విహారయాత్రకు కారులో మారేడుమిల్లి వెళుతుండగా వెనుక నుంచి లారీని ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఎం. నాగులపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా ఘంటశాల గ్రామానికి చెందిన స్నేహితులు వి.భానుప్రకాష్, గెల్లి గౌతమ్ కుటుంబరావు (28), వెంకటసాయి, ఘంటశాల మండలం చల్లపల్లికి చెందిన వి. భార్గవ్, గొల్ల తేజలు మంగళవారం రాత్రి విజయవాడలో టయోటా కారును అద్దెకు తీసుకుని 11 గంటల సమయంలో మారేడుమిల్లి విహారయాత్రకు బయలుదేరారు. మార్గమధ్యలో ఘటనా స్థలం వద్ద భానుప్రకాష్ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళుతున్న లారీని వేగంగా ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న గౌతమ్ కుటుంబరావు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కరుణకు ప్రతీక.. క్రిస్మస్ వేడుక

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్వాసులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ మత పెద్దలు శాంతి సందేశాన్నిచ్చారు. ప్రేమ, కరుణ, దయ, శాంతికి క్రిస్మస్ ప్రతీక అని, క్రీస్తు మార్గం అనుసరణీయమని అన్నారు. కేక్ కటింగ్‌లు, క్రీస్తు గీతాలపనలతో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.

- ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)



ఏలూరు అమలోద్భవి కథిడ్రల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్ పొలిమేర జయరావు



ఏలూరు అమీనాపేట లూథరన్ చర్చిలో విశ్వాసులు

అక్కరకు రాని సంక్షేమం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాది పొడవునా సంక్షేమ పథకాల లబ్ధి పొందుతూ వచ్చిన పేదవర్గాలకు 2024 తీవ్ర నిరాశను మిగిల్చింది. మొదటి రెండున్నర నెలల్లో మాత్రమే సంక్షేమ పథకాలు అందగా.. మిగిలిన ఏడాదంతా ఎటువంటి లబ్ధి చేకూరలేదు. గత ప్రభుత్వంలో ఈ ఏడాది మార్చి 14 వరకు పలు పథకాల రూపంలో రూ.513 కోట్ల సాయం అందించగా.. జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి సర్కారు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది.



సాక్షి, భీమవరం: 2024లో జిల్లా ప్రజలకు సంక్షేమం పావు వంతు మాత్రమే అందింది. మార్చి 15 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు పథకాల ద్వారా లబ్ధి అందించగా మార్చి 16న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయగా కోడ్ అమలుల్లోకి రావడంతో సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలు గెలుపొందాయి. జూన్ 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

జూన్ నుంచే ఇస్తామంటూ సంతకాలు చేసిచ్చి..

అధికారంలోకి రావడమే తరువాయి.. జూన్ నెల నుంచే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల ముందు కూటమి అభ్యర్థులు ఊదరగొట్టారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ సంతకాలు చేసి మరీ బాండ్ పేపర్లంటూ ఇంటింటా పంపిణీ చేశారు. ఏప్రిల్ 5న నరసాపురం, పాలకొల్లు, ఏప్రిల్ 10న తణుకు, ఏప్రిల్ 21న నరసాపురం, భీమవరం, ఏప్రిల్ 29న తాడేపల్లిగూడెం, మే న 10న ఉండి బహిరంగ సభల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సైతం ఇవే విషయాలు చెప్పారు. అయితే సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం పథకాల అమలు చేయాల్సి ఉండగా ఈ ఏడాదిలో వాటి ఊసే ఎత్తలేదు. దీంతో జిల్లాలో ప్రజలు కోట్లాది రూపాయల ప్రభుత్వ సాయానికి దూరమయ్యారు. సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి సరిపెట్టారు. ఏడాదికి మూడు సిలెండర్లని చెప్పి ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్క సిలిండర్‌ను మాత్రమే పరిమితం చేసింది.

కొత్త మంజూరులు నిల్

కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. రేషన్‌కా ర్డులు, బీమా, కల్యాణమస్తు, పింఛన్లకు సంబంధించి వెబ్‌సైట్లను గత నెలాఖరు వరకూ క్లోజ్‌లోనే ఉం చడంతో దరఖాస్తు చేయలేని పరిస్థితి.

హామీలు మరిచిన కూటమి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రూ.513 కోట్ల లబ్ధి
- మార్చి 15 నుంచి నిలిచిన పథకాలు
- జూన్‌లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం
- పింఛన్ మొత్తం పెంపుతో సరి
- పూర్తిస్థాయిలో అమలు కాని 'సూపర్ సిక్స్'
- జిల్లా ప్రజలకు నిరాశను మిగిల్చిన 2024



ఆరు నెలలు.. అమలు కాని హామీలు



జూన్ నుంచే పథకాలు ఇస్తామంటూ కూటమి నేతలు పంపిణీ చేసిన కరపత్రాలు (ఫైల్)

- కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీలు అమలు కాకపోవడంతో జిల్లాలో ప్రజలు కోట్లాది రూపాయల లబ్ధిని కోల్పోయారు.
- మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామన్న వాగ్దానం మేరకు జిల్లాలో సుమారు 5,96,313 మంది రూ.536.68 కోట్ల మేర నష్టపోయారు.
- జిల్లాలో మొత్తం 2,49,662 మంది విద్యార్థులు ఉండగా వీరిలో సుమారు 1,74,763 (70 శాతం) మంది తల్లికి వందనం పథకానికి అర్హులుగా భావిస్తే మొత్తంగా రూ.262.14 కోట్లు సాయం అందించాల్సి ఉంది.
- జిల్లాలో సుమారు 1,24,645 మంది రైతులు ఉన్నారు. వీరికి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.249.29 కోట్ల సాయం అందించాల్సి ఉంది.
- జిల్లాలో 5.17 లక్షల కుటుంబాలు ఉండగా 50 శాతానికి పైగా కుటుంబాల్లో నిరుద్యోగులు ఉన్నారు. వీరందరికీ నిరుద్యోగ భృతి కింద సాయం అందించాల్సి ఉంది.
- జిల్లాలో సుమారు 9,51,766 మంది మహిళలు ఉండగా ఎన్నికల హామీ మేరకు వీరంతా ఉచిత బస్సు సదుపాయం కోసం ఎదురుచూస్తున్నారు.
- ఇలా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కనీసం స్పష్టత కూడా ఇవ్వలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో ప్రజలకు అందిన లబ్ధి



మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ (ఫైల్)

- **జనవరి 1:** పింఛన్ సాయాన్ని రూ.3 వేలకు పెంచారు. దీంతో జిల్లాలో 2,36,928 మందికి రూ.69.55 కోట్ల లబ్ధి చేకూర్చారు. జిల్లాలో అర్హులకు 4,274 కొత్త పింఛన్లను మంజూరు చేశారు.
- **జనవరి 5:** జిల్లాలోని 2,439 మందికి పలు సంక్షేమ పథకాల కింద రూ.3.78 కోట్ల సాయం అందించారు.
- **జనవరి 11:** జగనన్న తోడు పథకం కింద జిల్లాలో 30,077 మంది చిరు వ్యాపారులకు రూ.78.61 లక్షలు వడ్డీ లేని రుణాలు అందించారు.
- **జనవరి 23:** వైఎస్సార్ ఆసరా పథకం కింద 27,004 డ్వాక్రా సంఘాలకు చెందిన 2,67,441 మంది సభ్యులకు రూ.275.90 కోట్ల సాయం జమచేశారు.
- **ఫిబ్రవరి 20:** వైఎస్సార్ కల్యాణమస్తు/షాదీతోఫా పథకం కింద 411 జంటలకు రూ.2.84 కోట్ల లబ్ధి చేకూర్చారు.
- **ఫిబ్రవరి 28:** జిల్లాలోని 1,27,114 మంది రైతులకు రైతు భరోసా పథకం కింద రూ.25.42 కోట్ల సాయం అందించారు. సున్నా వడ్డీ పంట రుణాలుగా 39,270 మంది రైతులకు రూ.5.53 కోట్లు నేరుగా వారి ఖాతాలకు జమచేశారు.
- **మార్చి 6:** ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన 32,545 మంది రైతులకు రూ.26.72 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అందజేశారు.
- **మార్చి 7:** వైఎస్సార్ చేయూత పథకం కింద 85,105 మంది మహిళలకు రూ.159.57 కోట్లు అందించారు.
- **మార్చి 14:** ఈబీసీ నేస్తం పథకం కింద 13,024 మంది మహిళలకు రూ.19.53 కోట్ల సాయం అందించారు.

వంచనలో చంద్రబాబు ఘనుడు

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజం



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజలను వంచించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనుడని, తెలుగుదేశం పార్టీ అబద్ధాల పుట్ట అని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. తాడేపల్లిగూడెంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత రెండు సార్లు కరెంట్ చార్జీలను పెంచిందన్నారు. దీంతో ప్రజలపై రూ.15,485.36 కోట్ల భారం పడిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేయడంతో పాటు ఐదేళ్ల విద్యుత్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తుందని ఆరోపించారు.

విద్యుత్ చార్జీలపై పోరుబాట : కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలను వెనక్కి తీసుకోవాలని, చార్జీల పెంపు రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 'కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు కొట్టు తెలిపారు. విద్యుత్ శాఖ డీఈ, ఏడీఈ, ఏఈలకు వినతిపత్రాలు అందిస్తామన్నారు.

డిస్కంలను కాపాడింది వైఎస్సార్‌సీపీనే..

2014–19 కాలంలో టీడీపీ ప్రభుత్వం రూ.86 వేల కోట్లు డిస్కంలకు బకాయిలు పెట్టిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.47 వేల కోట్లను డిస్కంలకు చెల్లించిందని కొట్టు అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో సోలార్ విద్యుత్ యూనిట్‌కు రూ.6.99లు చెల్లించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సెకీ ద్వారా యూనిట్‌ను రూ.2.49లతో సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుందన్నారు. 25 ఏళ్లపాటు చేసుకునే ఒప్పందం వల్ల సుమారు రూ.లక్ష కోట్లు ఆదా అవుతుందన్నారు. దీనిపై పచ్చమీడియా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

అన్నివర్గాలనూ మోసం

కూటమి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా, ఉచిత పంటల బీమాకు మంగళం పాటి రైతులను మోసం చేసిందని కొట్టు అన్నారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని, మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటున్నారని విమర్శించారు. అలాగే కూటమి ప్రభుత్వంలో బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు ప్రైవేట్ ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయని అన్నారు. ఉచిత విద్య, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా అమలు చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని అన్నారు. కూటమి నాయకులు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని హామీ ఇచ్చి దానినీ విస్మరించారని కొట్టు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి పార్టీల నాయకులు లిక్కర్, ఇసుక, మైనింగ్ మాఫియాలుగా రెచ్చిపోతున్నాయని ధ్వజమెత్తారు. నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్ర, జడ్డు హరిబాబు, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలనెత్తిన విద్యుత్ చార్జీల పిడుగు

మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: విద్యుత్ చార్జీలు పెంచబోమని, నాణ్యమైన విద్యుత్ సరఫరా అవసరమైతే యూనిట్ ధరలు తగ్గిస్తామని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై రుద్దారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను తుంగలోకి తొక్కిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. హామీ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మరింత పేదలుగా చేస్తున్నారని మండిపడ్డారు. హామీలను ఎగ్గొట్టడంలో చంద్రబాబు పీహెచ్‌డీ చేశారని దుయ్యబట్టారు. ఇదెక్కడి అన్యాయం అని నోరెత్తిన వారిపై కేసుల రూపంలో బెదిరించి పోలీసుస్టేషన్, కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. ఎన్నేళ్లిలా చేయగలరని, ఎంతమందిని అరెస్టు చేస్తారని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 27న విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పేరుతో నియోజకవర్గాల్లోని విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని అందిస్తామన్నారు. ఏ సంక్షేమం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.80 వేల కోట్లు అప్పులు చేసి ఏంచేశారని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే చెప్పిందే జరుగుతుంది

తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న పశు వధ కర్మాగార కార్యకలాపాల కారణంగా స్థానికులు రోడ్డెక్కినా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం, మాట్లాడకపోవడం హాస్యాస్పదంగా ఉందని కారుమూరి అన్నారు. ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యేకి తెలియకుండా ఏమీ జరగదని.. అదే విషయాన్ని ఆయనే గతంలో చెప్పారని, స్థానిక తహసీల్దార్‌ను ఆ కర్మాగారానికి తాళం వేసి రమ్మంటే మూతపడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అయితే తణుకు ఎమ్మెల్యే ఎందుకు నోరు విప్పడం లేదో అర్థం కావడం లేదని, తాను ఎమ్మెల్యేగా ఉండగా స్థానికులు సమస్య తెలపగానే ఫ్యాక్టరీ గేటుకు తాళాలు వేయించానని గుర్తుచేశారు. ఫ్యాక్టరీలో వాటాలు ఉన్నాయని తనపై ఆరోపణలు చేసినా మూయించానని అన్నారు. పశువధ కర్మాగారం సమస్యపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల వారితో కలిసి ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని కారుమూరి అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, వి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తుడి నిజాయతీ


పోగొట్టుకున్న వ్యక్తికి బంగారు బ్రాస్లెట్‌ను అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరవాసరం: ఓ భక్తుడి నిజాయితీతో పోయిన బంగారు బ్రాస్లెట్ తిరిగి లభించిన ఘటన ఇది. వీరవాసరం మండలం నందమూరుగరువు గ్రామంలో బుధవారం శ్రీరామభక్తాంజనేయ స్వామి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన బండి శ్రీను రెండు కాసుల బంగారు బ్రాస్లెట్ పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని శ్రీను కమిటీ సభ్యుల ద్వారా మైక్‌లో ప్రచారం చేయించాడు. భీమవరంనకు చెందిన రాంబాబు అనే మరో భక్తుడికి బ్రాస్లెట్ దొరకడంతో అతను నిజాయతీగా కమిటీ సభ్యులకు అందించగా వారు దానిని శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబును పలువురు అభినందించారు.

రిఫ్రిజిరేటర్ పేలి గృహోపకరణాలు దగ్ధం


దగ్ధమైన ఇంటిలోని సామగ్రి

ఆగిరిపల్లి: ఓ ఇంటిలో రిఫ్రిజిరేటర్ పేలిన ఘటన ఆగిరిపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక వేద పాఠశాల రోడ్డులోని చిట్టిపోతుల రవి అనే వ్యక్తి ఇంట్లో బుధవారం మధ్యాహ్నం ఫ్రిడ్జ్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు లక్ష రూపాయల విలువైన గృహోపకరణాలు దగ్ధమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిడ్జ్ కంప్రెసర్ పేలిపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

జగన్నాథం రచనలు అపురూపం


సాహితీవేత్త జగన్నాథంను సత్కరించిన దృశ్యం

ఉంగుటూరు : సాహితీవేత్త, ప్రవచన కర్త జటావల్లభుల జగన్నాథం రచనలు అపురూపమని, ఉత్తమ సమాజ నిర్మాణానికి పద నిర్దేశకాలని వక్తలు పేర్కొన్నారు. 98 ఏళ్ల వయస్సులో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. జగన్నాథం రచించిన సరస్వతీ ప్రసాద పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం కైకరం శివాలయంలో సాయి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌కు చెందిన సాహితీ వేత్త తామరపల్లి జగన్నాథరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు ఆచార్యుడు డాక్టర్ తలారి వాసు, కాకినాడకు చెందిన తెలుగు పండితుడు గిడుగు వెంకట చలపతిరావు, సత్సంగ వ్యవస్థాపకుడు కొచ్చర్లకోట శ్రీనివాసరావు, రాంపల్లి శ్రీరామకృష్ణ, అంగర సత్యనారాయణ, డా. సాయిరాం పాల్గొన్నారు.

పశువధపై పోరుబాట

- తేతలిలో పశువధ కర్మాగారంపై తీవ్ర వ్యతిరేకత
- పలుమార్లు స్థానికులు, గో సేవా సమితి సభ్యుల ఆందోళనలు
- అధికారులు పట్టించుకోకపోవడంతో నేటినుంచి పోరాటానికి నిర్ణయం
- అక్కడే వంటావార్పు నిర్వహణకు ఏర్పాట్లు
- పశువుల మాంసంతో వెళుతున్న లారీని పోలీసులకు అప్పగింత


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్: పశువధకు వ్యతిరేకంగా పాలకులు, అధికారులకు గోసంరక్షణ సమితి సభ్యులు, స్థానికులు పదేపదే వినతులు అందజేస్తూ వచ్చారు. సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్ చేశారు. ఫలితం లేకపోవడంతో పోరుబాట పట్టారు. గురువారం నుంచి ఫ్యాక్టరీ ఎదుటనే నిరసన తెలిపేందుకు నిర్ణయించారు.

తణుకు మండలం తేతలిలోని సత్యవాడ రోడ్డులో ఏర్పాటుచేసిన పశువధ కేంద్రం వివాదాస్పదంగా మారింది. 2016లో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు చేపట్టడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు. పనులు పూర్తిచేసి 2022లో పశువధ మొదలు పెట్టేందుకు ప్రయత్నించే సమయంలో స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అప్పటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ఫ్యాక్టరీ నడపకుండా అడ్డుకున్నారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఇక్కడ పశువధ కార్యకలాపాలు ఆగిపోయాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యాక్టరీ తెరిచేందుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. సెప్టెంబరులో నిర్వాహకులు పంచాయతీని ఎన్‌ఓసీ కోరగా అందుకు అధికారులు నిరాకరించారు. ఈ వ్యవహారం ఇలా నడుస్తుండగానే పశువధ మొదలు పెట్టారని స్థానికులు అంటున్నారు. అందుకోసం కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు చెబుతున్నారు. పశువుల వ్యర్థాలు గోస్తనీ కాలువలోకి వదులుతున్నారని, వాటి నుంచి వస్తున్న దుర్గంధంతో చుట్టుపక్కల నివాసం ఉండలేని పరిస్థితి నెలకొందని, రోగాల బారిన పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని కోరుతూ కొద్దిరోజులుగా గ్రామస్తులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సేవ్ తణుకు పేరిట సోషల్ మీడియాలో ఉధృతంగా క్యాంపెయిన్ చేశారు. పశువధను నిలిపివేయాలని మీకోసం కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. అయితే తమను సంప్రదించకుండానే సమస్య పరిష్కారమైనట్టుగా అధికారులు మెసేజ్‌లు పంపారని ఫిర్యాదుదారులు అంటున్నారు. రోజూ లారీల్లో భారీగా పశువులను ఫ్యాక్టరీలోకి తరలిస్తున్నారని, తణుకు పరిసర ప్రాంతాల్లో గోవుల సంఖ్య తగ్గిపోతోందని గోసంరక్షణ సమితి సభ్యులు చెబుతున్నారు. అక్రమ పశువధను అడ్డుకోవడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల రామరాజ్యం సంస్థ సభ్యులు కలెక్టరేట్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. కలెక్టర్‌పైనా ఆరోపణలు చేశారు. కాగా ఇక్కడ గోవధ జరగడం లేదని, ఇతర దేశాలకు గేదె మాంసం ఎగుమతికి అనుమతులున్నట్టు పశుసంవర్థశాఖ అధికారులు చెబుతున్నారు.

నేటినుంచి నిరవధిక నిరసన

పాలకులు, అధికారుల వైఫల్యాన్ని నిరసిస్తూ గురువారం నుంచి ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలిపేందుకు గ్రామస్తులు, గోసంరక్షణ సమితి సభ్యులు నిర్ణయించారు. ఫ్యాక్టరీ మూసేంత వరకు పోరాటం ఆపకుండా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా అవసరమైన టెంట్లు, మైక్‌సెట్లు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. పురుషులు, మహిళలు, పిల్లలు అక్కడే వంట వార్పు నిర్వహిస్తూ నిరసనలో పాల్గొననున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

ఫ్యాక్టరీ మూసేంత వరకూ పోరాటం



నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారుల అండతో పశువధ కర్మాగారాన్ని నిర్వహిస్తున్నారు. ఫ్యాక్టరీ తెరిచినప్పటి నుంచి ఈ ప్రాంతంలో పశువుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. కర్మాగారం మూసేంతవరకు గో సేవా సమితి తరపున స్థానికులకు అండగా నిలబడతాం.

– కొండ్రెడ్డి శ్రీనివాస్, గో సేవా సమితి సభ్యుడు

పట్టించుకునేవారు లేరు



ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుర్గంధంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారు లేరు. తేతలి అంటే గోగులమ్మ తల్లి వెలిసిన గ్రామంగా ప్రసిద్ధి. ఇప్పుడు పశువధ కర్మగారంగా పేరు మారిపోవడం దారుణం.

– కోట నాగేశ్వరరావు, తేతలి గ్రామ మాజీ సర్పంచ్

తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత


వ్యానులో ఉన్న పశువ్యర్థాలను చూపిస్తున్న గో సేవా సమితి సభ్యులు, తేతలి గ్రామస్తులు

తణుకు అర్బన్: తేతలి గ్రామ పరిధిలోని లేహం ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారం లోపల నుంచి వచ్చిన వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు అప్పగించిన వ్యవహారం తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. కర్మాగారం ప్రాంతంలో బుధవారం ఉదయం భారీగా గ్రామస్తులు, గోసేవాసమితి సభ్యులు ఉండగా లోపల నుంచి బయటకు వచ్చిన పాల వ్యానును అడ్డుకుని పోలీసుల సాయంతో తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేశారు. అయితే ఈ వ్యవహారంపై విచారణ చేస్తామని చెప్పి పోలీసులు వ్యాన్‌ను పంపించేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఎట్టకేలకు కర్మాగారం, వాహనంపైనా కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కర్మాగారం లోపల నుంచి వచ్చిన వాహనంలో పశు కళేబరాలతోపాటు వ్యర్థాలు ఉన్నాయని, ఇది పశు వధ జరుగుతుందనడానికి నిదర్శనమని అన్నారు. తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, గ్రామ నాయకులు కోట స్వామీజీ, గోసేవా సమితి సభ్యులు జల్లూరి జగదీష్, మహిళలు పాల్గొన్నారు.

చోరీల్లో వేగం పెంచాడు.. పోలీసులకు చిక్కాడు


భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నయీం అస్మి, పక్కన డీఎస్పీ జయసూర్య, సీఐలు నాగరాజు, కాళీచరణ్

- రూ.13.80 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నయీం అస్మి

భీమవరం: అతనొక కారుడ్రైవర్. చెడు వ్యసనాలకు అలవాటుపడడంతో సంపాదన సరిపోలేదు. దీంతో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. చివరికి చోరీల్లో వేగం పెంచి పోలీసులకు చిక్కాడు. పలు చోరీ కేసుల్లో నిందితుడైన భీమవరం పట్టణం మెంటేవారితోటకు చెందిన గోన వంశిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.13.80 లక్షల చోరీ సొత్తుని స్వాధీనం చేసుకున్నారు. భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు వెల్లడించారు.

నేర ప్రవృత్తి ఇలా..

కార్ ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేసే గోన వంశికి 2017లో బోడపాటి ప్రవీణ్‌తో పరిచయమైంది. చెడు వ్యసనాలు అలవాటు కావడంతో ఇద్దరూ కలిసి వాహనాల దొంగతనాలు ప్రారంభించారు. ఇదే క్రమంలో ప్రవీణ్‌తో కలసి కారు, ఆటో చోరీ కేసులో పోలీసులకు దొరికిపోయారు. ఆ తరువాత ఆటో మెకానిక్‌గా పనిచేస్తూ 2023లో రాత్రి సమయంలో తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. వంశీపై భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 6, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి దొంగతనం కేసులు నమోదయ్యాయి. ఈ నేరగాడిపై డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య పర్యవేక్షణలో వన్‌టౌన్, టుటౌన్ సీఐలు ఎం నాగరాజు, జి కాళీచరణ్, వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ప్రత్యేక బృందంతో నిఘా పెట్టారు. బుధవారం ప్రకాశంచౌక్ సెంటర్‌లో వంశీని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.13.80 లక్షల విలువ బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

పార్శిల్‌లో శవం కేసు వివరాలు త్వరలో వెల్లడిస్తాం

ఉండిలో సంచలనం సృష్టించిన పార్శిల్‌లో శవం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామని ఎస్పీ నయీం అస్మీ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. భీమవరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

10 రోజులు.. 210 బస్సులు

- సంక్రాంతికి 'పశ్చిమ' ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- హైదరాబాద్‌కు రాకపోకల కోసం స్పెషల్ బస్సులు
- ఆన్‌లైన్ బుకింగ్‌లో 10 శాతం రాయితీ



భీమవరం (ప్రకాశంచౌక్): సంక్రాంతి పండగకు హైదరాబాద్ నుంచి సొంత ఊర్లకు వచ్చే వారి కోసం పశ్చిమ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. సంక్రాంతి పండగకు హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే వారి కోసం జనవరి 9 నుంచి 12 వరకు రోజుకు 30 బస్సులు చొప్పన నాలుగు రోజులు పాటు 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి జనవరి 9 మొదలు 12వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి ప్రత్యేక బస్సులు బయలురేరి జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నర్సాపురం డిపోల పరిధిలోని బస్టాండ్లకు సర్వీసు చేస్తాయి. ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఇంద్ర బస్సులను సంక్రాంతి ప్రత్యేక బస్సులుగా నడపనున్నారు. అలాగే పండగ అనంతరం తిరుగు ప్రయాణానికి 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రోజుకు 15 ప్రత్యేక బస్సులు జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో ఆయా బస్టాండ్ల నుంచి హైదరాబాద్‌కు నడపనున్నారు.

సాధారణ టికెట్ ధరకే ప్రయాణం

సంక్రాంతి పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ టికెట్ ధరలకే సర్వీసు చేయాలని నిర్ణయించింది. అలాగే ఆన్‌లైన్ బుకింగ్‌పై 10 శాతం రాయితీ కల్పిస్తుంది. ఇప్పటికే ఆన్‌లైన్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఈ ఏడాది జనవరిలో 208 ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.60 లక్షల ఆదాయం ఆర్టీసీకి సమకూరింది. మూడేళ్లుగా సంక్రాంతికి ఆదాయం పెరుగుతూనే ఉంది. అలాగే ఈ ఏడాది కార్తీక మాసంలో 194 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.56 లక్షల ఆదాయం సమకూరింది.

హైదరాబాద్‌కు టికెట్ చార్జీలు

ఇంద్ర	రూ.930
సూపర్ లగ్జరీ	రూ.730
ఎక్స్‌ప్రెస్	రూ.710
అల్ట్రా డీలక్స్	రూ.720

సంక్రాంతి ఆదాయం

సంవత్సరం	ఆదాయం
2024	రూ.60.00 లక్షలు
2023	రూ.54.62 లక్షలు
2022	రూ.36.88 లక్షలు

ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలి



హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేవారు సంక్రాంతి ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలి. పండుగ ముందు, తర్వాత ఇవి నడుస్తాయి. జనవరి 9 తేదీ నుంచి 20వ తేదీ వరకు మధ్యలో రెండు రోజులు మినహాయించి 10 రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఆన్‌లైన్ రిజర్వేషన్లు ద్వారా టికెట్ ధరలో 10 శాతం రాయితీ అందిస్తున్నాం.

– ఎన్‌వీఆర్ వరప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి

పశుగ్రాసం కొరతను అధిగమించండి ఇలా..


మెట్టలో ఆయిల్‌పాం తోటల్లో మొక్కజొన్న అంతర్ పంటగా సాగుచేస్తున్న రైతులు

పాడి పంట

చింతలపూడి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా లేదు. వర్షాభావంతో మెట్ట ప్రాంతంలో పంటల సాగు దయనీయంగా మారింది. ఎండలకు వరి పంట అనేక గ్రామాల్లో ఎండిపోవడంతో భవిష్యత్‌లో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ దశలో గ్రామీణ ప్రాంతాల్లో పాడిని నమ్ముకున్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పశు పోషణలో 70 శాతం ఖర్చు మేతకే అవుతుందని తెలిసిందే. వర్షాభావం ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ తెలియజేస్తున్నారు. వర్షాభావంలో పశుగ్రాస కొరతను అధిగమించడానికి రైతులకు పలు, సూచనలు చేస్తున్నారు.

అంతర పంటగా పశుగ్రాసాల సాగు

పంట కోత తరువాత, పండ్ల తోటల్లోని మొక్కల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పప్పు జాతి పశుగ్రాసాలు అలసంద, ఉలవ, పిల్లిపెసర, జనుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం వల్ల పశుగ్రాసం కొరతను అధిగమించడంతో పాటు భూమిలో నత్రజని స్థిరీకరించబడి భూసారం పెరిగే అవకాశాలు ఉంటాయి.

జనుము

ఇది కాయజాతి పశుగ్రాసం. అన్ని నేలల్లోనూ అన్ని కాలాల్లో కొద్దిపాటి నీటితో కూడా పండించుకోవచ్చు. ఎకరానికి 12 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లాలి. విత్తిన తరువాత 40, 50 రోజులకు కోతకు వస్తుంది. ఈ మేతను పూత దశలో కోసి ఎండు మేతగా వినియోగించుకుంటే ఉపయోగం ఉంటుంది.

పిల్లి పెసర

వరి సాగు చేసే అన్ని భూముల్లో అంతర పంటగా దీన్ని సాగు చేసుకోవచ్చు. సాధారణ భూములకు పచ్చి రొట్టగా వాడితే భూమికి బలం చేకూరుతుంది. శీతాకాలంలో రబీ పంటగా ఈ పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసం వేర్లలో నత్రజని బుడిపెలు ఉండటం వల్ల భూమి సారవంతమవుతుంది. వరి పంట కోయడానికి 3, 4 రోజుల ముందు అంటే భూమిలో తేమ ఉన్నప్పుడే ఎకరానికి 10–15 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లుకోవాలి. 50 రోజుల్లో కోతకు వచ్చే ఈ పశుగ్రాసం వల్ల ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పచ్చి మేత లభిస్తుంది.

ఇతర రకాలు


బి నాగకుమార్ సహాయ వ్యవసాయ సంచాలకులు, చింతలపూడి సబ్ డివిజన్

ఇక పశుగ్రాస మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ రకం జె 1006–రకం, విజయ కాంపోజిట్ రకాలు 85 రోజులకు ఒకేసారి కోతకు వస్తాయి. పండ్ల తోటలు, పామాయిల్ తోటల్లో కూడా సాగు చేసుకోవచ్చు. రైతులకు అధిక పశుగ్రాస దిగుబడులను అందిస్తాయి. పప్పు జాతి రకాలైన అలసంద (బొబ్బర్లు) రష్యన్ జైంట్, బుందేల్ లోబియ 1, 2, ఇసి 4216–5287, కేబీసీ 2 మొదలైన రకాలు 55 నుంచి 60 రోజుల్లో ఒకే కోతలో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందిస్తాయి.

మద్యం సీసాలు స్వాధీనం

తాడేపల్లిగూడెం: గూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణపవరం మండలం సరిపల్లిలో బుధవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, పది డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. దాడుల్లో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలపై మెరుపు దాడులు


గుళ్ళపూడిలో సారాబట్టీపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

ముసునూరు : ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సారాబట్టీపై మెరుపు దాడులు నిర్వహించారు. గుళ్ళపూడిలో తమ్మిలేరు ఒడ్డున నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి నిర్వహించి 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. బట్టీ యజమాని బోట్ల శేఖర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్, ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని జిల్లేళ్లగూడెం సమీపంలో పంట కాలువ ప్రదేశాల్లో పోలవరం ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ అధికారులు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట కలిగిన మూడు డ్రమ్ములను గుర్తించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం తగదు



సభలో మాట్లాడుతున్న కమలానంద భారతీ స్వామీజీ

కమలానంద భారతీ స్వామీజీ

తాడేపల్లిగూడెం: ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం తగదని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామీజీ అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌వీఆర్ సర్కిల్ వద్ద బుధవారం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. దేవాదాయశాఖను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం దేవాలయాల బాధ్యత నుంచి తప్పుకుంటే వాటిని నిర్వహించేందుకు మంచి వ్యక్తులు కావాలన్నారు. దేవాదాయశాఖలో నీతిని మరిచిన వారున్నారని, అలాంటి వ్యక్తులు హిందూ ధర్మాన్ని, ఆలయాలను ఎలా పరిరక్షిస్తారన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. దేవుడికి ప్రాణ ప్రతిష్ట చేసే ఆగమ శాస్త్రం హిందూ ధర్మంలో ఉందన్నారు. సమాజంలో ఏం జరుగుతుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయాల పరిరక్షణ కోసం నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలన్నారు. వీహెచ్‌పీ నియోజకవర్గ కన్వీనర్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి, రాష్ట్ర నాయకురాలు పద్మావతి ప్రాంత ప్రచారక్ సుంకవల్లి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి కారుమూరికి కృతజ్ఞతలు



తణుకులో మాజీ మంత్రి కారుమూరిని కలిసిన పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్‌కుమార్‌లు బుధవారం మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పదవులు కేటాయించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సిఫార్సు చేసిన మాజీమంత్రి కారుమూరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిందిగా కారుమూరి కోరారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మోటూరి రమణ కుమారుడు భీమవరంలోని ఒక కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతని విద్యాభ్యాసం నిమిత్తం ల్యాప్ టాప్ కోసం దాతలను ఆశ్రయించగా, దీంతో స్పందించిన మాధవరం గ్రామానికి చెందిన బాలం కృష్ణ ల్యాప్‌టాప్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు మోటూరి రమణ కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



భీమవరంలో సీపీఐ శత వార్షికోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: సీపీఐ శత వార్షికోత్సవాలను పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో వందలాది మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారన్నారని భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల బానిసత్వ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులను కాల్చి చంపారన్నారు. ప్రజల జీవనోపాధి, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజ సాధన దిశగా వందేళ్లుగా సీపీఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, యేలేటి విజయానంద్, వై జోయల్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబసభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి తణుకు మండలం దువ్వ యూనియన్ బ్యాంకు బీమా రూపంలో రూ. 2 లక్షలు చెక్కు అందజేశారు. బ్యాంకు ఖాతాదారుడు మద్దూరి లక్ష్మి నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమాయోజన పథకంలో భాగంగా ఏడాదికి రూ. 436 చొప్పున దువ్వ యూనియన్ బ్యాంకు నందు జమచేసిన కారణంగా నామినిగా ఉన్న మృతుడి భార్య అన్నపూర్ణకు ఈ మొత్తాన్ని అందజేసినట్లు బ్యాంకు మేనేజర్లు వి.దివ్య, మోహన్ తెలిపారు.

వైభవంగా వాసవీ హోమం



వాసవీ శాంతిధాంలో పూజలు నిర్వహిస్తున్న కర్ణాటక వాసులు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం కర్ణాటక భక్తులు వాసవీ పూజలు, వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా సాయి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, మరకత వాసవీ మాతలకు పూజలు, అభిషేకంలు నిర్వహించిన అనంతరం వాసవీ హోమం వేడుకగా నిర్వహించారు.

గూడెంలో రైతు బజారు ఏర్పాటు ఎప్పుడో..?



గతంలో ఈ షెడ్డులోనే రైతు బజారు ఏర్పాటు చేసిన దృశ్యం(ఫైల్)



ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలంలో అందులో లారీలు నిలిపిన దృశ్యం (ఫైల్)

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాకు భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న తాడేపల్లిగూడెం పట్టణానికి రైతు బజారు లేకపోవడం శోచనీయం. చుట్టుప్రక్కల రైతులు లబ్ధి పొందేందుకు వినియోగదారునికి తక్కువ ధరలకు అందజేసేందుకు రైతు బజార్లు ప్రారంభం కాగా ప్రభుత్వం వీటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా చాల చోట్ల రైతులు బజార్‌లు మూతపడ్డాయి. దీంతో ప్రజలు బయట మార్కెట్‌లో అధిక ధరలకు కూరగాయాలు కోనాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆదివారం సంత మార్కెట్ ఉన్నప్పటికి నేరుగా రైతులు కాకపోవడంతో మధ్యవర్తులు అమ్మకాలు కారణం వల్ల రోజు వారీ డైలీ మార్కెట్, హోల్‌సేల్ మార్కెట్‌లకు మధ్య ధరలు వ్యత్యాసం అంతగా ఉండటం లేదు. తాడేపల్లిగూడెం నుంచే ఉల్లిపాయలకు హోల్‌సేల్ మార్కెట్‌కు తాడేపల్లిగూడెనకు ప్రసిద్ధి. అయినప్పటికి ఉల్లి ధరలు తగ్గకపోవడం శోచనీయం. ఇక్కడ నుంచే వివిధ ప్రాంతాలకు ఉల్లిపాయిలతో పాటు ఎండుమర్చి, ఇతర వస్తువులు రవాణా అవుతాయి. అటువంటి ఈ ప్రాంతంలో రైతు బజారు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రేకుల షెడ్డులో రైతు బజారు

గతంలో తాలూకా ఆఫీస్ సెంటర్‌లో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఒక రేకుల షెడ్డులో రైతు బజారు నిర్వహించారు. ఏ కారణంగానో తెలియదు కాని అది కూడా కొంత కాలం మాత్రమే నడిచింది. రైతు బజారు మూత పడింది. కొన్ని రోజులు వీఆర్‌ఓలకు కార్యాలయంగాను, ప్రస్తుతం షెటిల్ కోర్టుగాను నడపబడుతుంది. మూతపడిన నాటి నుంచి రైతు బజారు విషయాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు.

గొల్లగూడెం సెంటర్‌లో ఖాళీ స్థలం

స్థానిక గొల్లగూడెంలో చెరువు పూడ్చడం అనంతరం కాలంలో ఉన్న ఖాళీ స్థలంలో రైతు బజారు ఏర్పాటు చేసేందుకు అప్పట్లో మంత్రిగా ఉన్న పైడికొండల మాణిక్యాలరావు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.8 కోట్లతో అత్యంత్త ఆధునిక వసతులతో కూడిన మోడల్ రైతు బజారు ఏర్పాటు చేసేందుకు కృషి జరిగింది. కేంద్రం నుంచి నిధులు మంజూరు అయిన్పటికి స్థానికంగా అనుమతులు ఆలస్యం కావడం, ఇతర కారణాలు చేత రైతు బజారు వేరే ప్రాంతానికి తరలివెళ్లిపోయింది. ప్రస్తుతం ఆ ఖాళీ స్థలం చెత్తచెదారాలకు, పిచ్చి మొక్కలకు, లారీలు, ప్రైవేట్ బస్సులు నిలుపుదల ప్రదేశంగా మారింది.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

రైతు బజారు ఏర్పాటు చేస్తే విశాలమైన ఖాళీ స్థలం, ప్రభుత్వం అందించే మౌలిక సదుపాయాలు, షెడ్లులు, తాగు నీటి సరఫరా ఏర్పాట్లు, పారిశుద్ధ్య సౌకర్యంతో కూడిన మరుగు దొడ్లు, వాహనాలు పార్కింగ్, చెత్తను తొలగించేందుకు, శుభ్రపరిచేందుకు పారిశుద్ధ్య కార్మికుల సహకారం నిల్వ చేయడానికి కోల్డ్ స్టోరేజీలు తదితరు సౌకర్యాలు కావాలి. రైతు బజారులలో దళారుల ప్రవేశాన్ని నివారించేందుకు అధికారులు తప్పక చర్యలు తీసుకోవాలి.

రైతు బజారు ప్రశ్నర్థాకం

మండలానికి ఒక రైతు బజారు పథకంలో భాగంగా నిధులు కేటాయించారు. తీర్మానాలు జరిగాయి. అవి కార్యారూపం దాల్చలేదు. కాగితాలకే పరిమితం చేశారు. అసలు రైతు బజారు పట్టణంలో ఏర్పాటు చేస్తారా లేదా అన్నది ప్రశ్నర్థాకంగా ఉంది.

మధ్యవర్తులు కారణంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి

కష్టపడి పండించిన కూరగాయాలను దళారి వ్యవస్థ లేని మార్కెట్‌లో అమ్మేందుకు సాహసం చేయలేని పరిస్థితులలో ఆ రైతులు తమ సరుకును హోల్‌సేల్ వర్తకులకు అమ్ముతున్నారు. మధ్యవర్తులు కారణంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వాస్తవానికి రైతు తాను పండించిన పంటను రైతు బజారులో నేరుగా అమ్మితే గిట్టుబాటు ధర వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రైతు బజారు అందుబాటులో లేకపోవడంతో అటు రైతు, ఇటు ప్రజలు నష్టపోతున్నారు. ప్రభుత్వాలు చోద్యం చూడటం తప్ప సామాన్యులు గురించి ఆలోచన చేయడమే లేదు. రైతు బజారు ఏర్పాటుకు మార్కెట్ కమిటీ, ప్రజా ప్రతినిధులు సైతం చొరవ చూపాలని, పట్టణంలో రైతు బజారు ఏర్పాటు ద్వారా సరసమైన ధరలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మోడల్ రైతు బజారు కలగానే మిగిలిపోయింది



మోడల్ రైతు బజారు అన్నారు కాని అది కల లాగే మిగిలిపోయింది. గతంలో రైతు బజారు ఉండేది. ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయాలు, ఇతర వస్తువులు అందేవి. నేడు రైతు బజారు లేదు. అధిక ధరలతో కొనుగోలు శక్తి నశించింది. రైతు బజారు విషయమై అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. కాని సమస్యల పరిష్కారం కాలేదు. –సీహెచ్‌పీఎం శర్మ, సీనియర్ న్యాయవాది

ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి



ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు కూరగాయలు, ఉల్లిపాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేయాలంటే వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. పట్టణంలో తత్కాలికంగానైన రైతు బజారు ఏర్పాటు చేయాలి. రైతులకు, ప్రజలకు లాభసాటిగా ఉండే విధంగా అధికారులు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

–మహమ్మద్ కపర్థి, ఆర్‌ఎంపీ వైద్యులు

నేడు సోలార్ పవర్‌పై డెమో

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శశి కళాశాల రోడ్డులోని లయన్స్‌క్లబ్ భవనంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు సోలార్ పవర్ పై డెమో ప్రజెంటేషన్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ వెల్లడించారు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీం, 78,000 బ్యాంక్‌లచే సబ్సిడీ, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు, సోలార్ పరికరాలు తదితర అంశాలపై డెమో ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలి



దర్శిపర్రులో ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు: పల్లెలలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన దర్శిపర్రు గ్రామంలో సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు ఆధ్వర్యంలో పంచాయతీ చెత్త సేకరణకు సంబంధించిన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌అన్నారు. బుధవారం మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు ఉన్న ప్రాంతానికి దూరంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే ఆ ప్రాంతాల్లో కొత్తగా సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పైబోయిన వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పునః ప్రారంభం



పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: వెంకయ్య వయ్యేరు పంట కాలువకు సమాంతరంగా రూ.30 కోట్లతో చేపట్టిన పైప్‌లైన్ పనులు పునః ప్రారంభించారు. గత రెండు దశాబ్దాలుగా పైప్‌లైన్ పనులు మూలనపడ్డాయి. నిడదవోలు కాలువ నుంచి పరిమళ్ల లాకుల వరకూ ఉన్న ప్రధాన పంట కాలువ నుంచి వెంకయ్య వయ్యేరు పంట కాలువకు వచ్చే నీరు కలుషితమవ్వడంతో నేరుగా నీటిని పైపుల ద్వారా సరఫరా చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి, మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.30 కోట్ల నిధులు కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ పాతపాటి సర్రాజు యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టినప్పటికీ ఆ తరువాత ఎమ్మెల్యే మారడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆగిపోయాయి. ప్రధాన పైప్‌లైన్ నుంచి గ్రామాలను అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ల నిర్మాణం, ఓహెచ్ఎస్ఆర్, సంప్‌ల నిర్మాణం పూర్తయింది. తరువాత వచ్చిన ఎమ్మెల్యే పైప్‌లైన్ పనులను పట్టించుకోలేదు. ప్రస్తుతం వెంకయ్య వయ్యేరు పంట కాలువలో నీరు పూర్తిగా కలుషితమైపోయి ప్రవహిస్తుందని, సెలనిటీ శాతం పెరిగిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేయడంతో పనులను పునఃప్రారంభించేందుకు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చర్యలు చేపట్టారు. చినకాపవరం ఓహెచ్ఎస్ఆర్ వద్ద జాయింట్ పనులను బుధవారం చేపట్టారు.

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో క్రిస్మస్ కేకు కట్‌చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి



పెంటపాడు: ఈపీఎఫ్ చర్చిలో భక్తి గీతాలు ఆలపిస్తున్న యువతులు



తణుకు అర్బన్: వేల్పూరు చర్చిలో కొవ్వొత్తులతో విశ్వాసులు



తణుకు అర్బన్: వేల్పూరు ఎస్‌టీపీఎంసీ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సంఘాల నాయకులు



పెంటపాడు: చర్చిలో వృద్ధులకు బహుమతులు అందజేస్తున్న పాస్టర్ మోజస్ ప్రవీణ్

తణుకు అర్బన్: తోటి వారికి సాయపడమనే ఏసు క్రీస్తు బోధనలు ఆదర్శనీయమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఏకైక పండుగ క్రిస్మస్ అని, ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్నాని, అందరూ సుఖసంతోషాలతో తులతూగాలని ఆకాంక్షించారు. అనంతరం క్రిస్మస్ కేకు కట్‌చేసి చిన్నారులు, పార్టీ శ్రేణులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, నాయకులు పొట్ల సురేష్, జంగం ఆనంద్‌కుమార్, వి.సీతారాం, ఝాన్సీ లారెన్స్, షేక్ ఫహీమా, రామిశెట్టి రాము, ఎస్‌వీ జాకబ్‌బాబు, షేక్ జిలానీ, వై.రామకృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. తణుకు నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. బుధవారం రాత్రి చర్చిల్లోను, పలు సంఘాల ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా బుధవారం రాత్రి పలు చర్చిల్లో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేకులు కట్ చేశారు. ఏసునేడు పుట్టెను అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గంలోని చర్చిలన్నీ విద్యుత్ దీపాల వెలుగులతో అలరించాయి. తణుకు వల్లూరి వారి వీధిలో సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం 19వ వార్షికోత్సవ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా రంజాన్, క్రిస్మస్, వినాయక చవితి పండుగలను నిర్వహించేందుకు వల్లూరి వారి వీధి వేదికగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ షేక్ జాంగ్రీ భాషా చేతులమీదుగా క్రిస్మస్ కేకు కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో బాల బాలాజీ, నాగరాజు, బుజ్జి, రమేష్, ముక్త కిరణ్, సామాజిక ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: గూడెం నియోజకవర్గంలో పలు క్రైస్తవ మందిరాలలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఘనంగా జరిగాయి. గూడెం సెంటినరీ లూథరన్ చర్చిలో గురుమండల అధ్యక్షుడు ఫీనెహాస్, సహాయగురుమండల అధ్యక్షుడు రత్నాకర్, ముదునూరుపాడు బైబిలుమిషను మందిరంలో మిషను ఉపాధ్యక్షుడు ఎ. దైవారావు, గూడెంలోని హానోక్, కల్వరి మందిరాలలో దైవసేవకులు రాజా ఎలీషా, మరనాత ఎలీషా, ఆనంద్‌బెసలేల్, భాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం మందిరంలో పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు, బిషప్ ఐజక్ ముగ్గళ్ల, కొండాయిచెర్వు ఫెయిత్ చర్చిలో రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్, గూడెం మథర్‌వన్నిని చర్చి, పాతూరు ఆర్సీఎం చర్చిలో ఫాదర్లు, గొల్లగూడెంలోని దేవుని మందిరంలో ఆర్ ఎజ్రాశాస్త్రి, జట్లపాలెం, యానాలపల్లి, కె. పెంటపాడు గ్రామాలోని లూథరన్ సంఘ దేవాలయాలతో పాటు పలు చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ నాటికలు వేసారు. చిన్నారులు దేవుని వాక్యాలను ఉచ్చరించారు. పలు చర్చిలలో పేదలకు, అన్నవస్త్రాదానాలు చేశారు. తణకు ఈఫీఎఫ్ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ మోజస్ ప్రవీణ్, జగ్గంపేటకు చెందిన బిషప్ యర్రంశెట్టి మీకా, రాజమండ్రికి చెందిన డాక్టర్ నేతెట్టి నవీన్‌బాబు, నిడదవోలుకు చెందిన షారోన్ జ్యోతి, తణుకుకు చెందిన పరస అరుణ కుమారిలు దేవుని దీవెనలకు భక్తులకు అందజేశారు. క్రిస్మస్ వర్తమానాలను వివరించారు. పాస్టర్ మోజస్ ప్రవీణ్ ఈ సందర్భంగా పేదలకు అన్నవస్త్ర దానాలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలలో యూత్ సభ్యులు స్కిట్స్ వేసి అలరించారు. ఆయా సంఘ కాపరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మీనవిల్లూరు యేసయ్యా ప్రార్థనామందిరంలో మోషే, ఆరుళ్ల క్రీస్తు దేవాలయంలో రమేష్, చినతాడేపల్లి షెకీనా ప్రార్థనామందిరం, రాచర్ల రూపాంతర దేవాలయం, దర్శిపర్రు బైబిలుమిషను మందిరం, కడియద్ద, బంగారుగూడెం, తదతర ప్రాంతాలలో క్రిస్మస్ ఆరాధనలు ఘనంగా జరిగాయి. సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గూడెం భాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం చర్చిలో పాస్టర్ మల్లిపూడి జైబాబు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అటల్ బిహారి వాజ్‌పేయి



అటల్ బిహారి వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అత్తిలి: స్ఫూర్తి దాత భారత రాజకీయాల్లో భీష్మ పితామహుడిగా పేరుగాంచిన మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని అత్తిలి మండలం పాలి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ అణు పరీక్ష, నేషనల్ హైవేస్, గ్రామీణ సడక్ రోడ్లు, కార్గిల్ యుద్ధంలో విజయం, సంస్కరణలు ఇలా దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. వాజ్‌పేయిని అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం 153 పోలింగ్ బూత్ అధ్యక్షునిగా మల్లిడి కల్కి రెడ్డి, ఏకగ్రీవంగా బూత్ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. ముందుగా వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ద్వారంపూడి వెంకటసుబ్బారెడ్డి, పాలి నీటి సంఘం డైరెక్టర్ మేడపాటి అప్పారెడ్డి, కొవ్వూరి భాస్కర్ రెడ్డి, వెలగల శ్రీనివాసరెడ్డి, సత్తి సాయిరెడి, రామిరెడ్డి, సుబ్బిరెడ్డి బూత్ సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి శత జయంతి

ఇరగవరం: బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని నిర్వహించారు. పలువురు బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, మండల అధ్యక్షుడు కాట్నం పరిపూర్ణం, ప్రధాన కార్యదర్శి శీలబోయిన శ్రీనివాస్, గిద్దా రాంబాబు, గుడాల నరసింహమూర్తి, పతివాడ శివ ప్రసాద్, ఆకుల కృష్ణ, దాసిరెడ్డి నాగరాజు, మల్లిపూడి నాగవరప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలతో బాదుడే బాదుడు

ఆకివీడు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలు బోరుమంటున్నారని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు ఆరోపించారు. ఈ నెల 27వ తేదీన స్థానిక సబ్ స్టేషన్ వద్ద నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ ధర్నా సందర్భంగా బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాజు నివాసం వద్ద ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆక్వా రంగానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. లోకేష్ పాదయాత్రలో ఆక్వా పరిశ్రమకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదన్నారు.

అన్నదాతకు భరోసా కరువు

- రైతులకు అందని రైతు భరోసా సొమ్ము
- ఇచ్చిన హామీని పక్కన పెట్టిన ప్రభుత్వం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



రైతు భరోసా కేంద్రం

ఇరగవరం: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు నిర్లక్ష్యానికి గరవుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధకశాఖల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలు అందించేందుకు ఈ రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పేరు మార్పు తప్ప సాయం లేదు

మండలంలో సుమారు 10,617 మంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం నుంచి దశల వారీగా డీబీటీ విధానం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా సొమ్మును అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తు ఖరీఫ్ సీజన్ పూర్తయినా కాని నేటికీ ప్రభుత్వం రైతులకు భరోసా అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి రైతు సేవా కేంద్రాలుగా నిర్వహణ చేపట్టారు. కానీ రైతులకు సాయం అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండి పడుతున్నారు.

అసంపూర్తిగా భవనాలు

గత ప్రభుత్వం మండలంలోని 20పంచాతీలకు 26 గ్రామ పంచాయతీలుగా, 17 గ్రామ సచివాలయాలుగా విభజించింది. 17గ్రామ సచివాలయాలకు 17రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.21లక్ష చొప్పున నిధులు మంజూరు చేసింది. వీటిలో 8కేంద్రాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులకు శిక్షణ కార్యక్రమాలు, విత్తనాలు, ఎరువులు అందడం లేదని చెబుతున్నారు.

అందని పెట్టుబడి సాయం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తియినా నేటికీ పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం అందించలేదు. ఏటా రూ.20వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా సొమ్ము అందించలేదు. రైతులందరం ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలి.

సత్యనారాయణ, రైతు, ఇరగవరం